## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వినాయక్‌నగర్, ఆగస్టు 9 : నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 71 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ శుక్రవారం అందజేశారు. మొత్తం రూ.18 లక్షల, 19 వేల విలువ చేసే చెక్కులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

## సంగీత పాఠశాల ప్రిన్సిపాల్‌గా రవీందర్‌రాజు

సుభాష్‌నగర్, ఆగస్టు 9 : జిల్లాకేంద్రంలోని శ్రీజ్ఞానసరస్వతీ సంగీత నృత్య పాఠశాల ప్రిన్సిపాల్‌గా పులిపాటి రవీందర్ రాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్ రాంకోటి శ్రీ త్యాగరాజ సంగీత నృత్య పాఠశాలలో కథక్ లెక్చరర్‌గా విధులు నిర్వహించిన రవీందర్ రాజు ఉద్యోగోన్నతిపై ఇక్కడికి బదిలీపై వచ్చారు. నాలుగేండ్ల పాటు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన సరిత పెద్దపల్లి జిల్లా మంథనికి బదిలీపై వెళ్లారు. హిందుస్థానీ శిక్షకురాలిగా పనిచేస్తున్న అనిత వరంగల్‌కు బదిలీ అయినట్లు రాష్ట్ర సాంస్కృతిక శాఖ అధికారులు తెలిపారు.

## ఆర్టీసీ ఆధ్వర్యంలో లక్కీడ్రా

లక్కీడ్రా తీస్తున్న ఆర్టీసీ అధికారులు

ఖలీల్‌వాడి, ఆగస్టు 9 : నిజామాబాద్ – వరంగల్ రూట్‌లో డీలక్స్ బస్సులో ప్రయాణించిన మహిళలకు గిఫ్ట్ స్కీం ప్రవేశపెట్టగా.. జిల్లాకేంద్రంలోని బస్టాండ్‌లో శుక్రవారం లక్కీడ్రా తీసి ముగ్గురు మహిళా ప్రయాణికులను ఎంపిక చేశారు. జూలై 15 నుంచి 31 మధ్యలో ప్రయాణించి డ్రాలో గెలుపొందిన విజయలక్ష్మి (పెద్దపల్లి), సౌజన్య (ఆర్మూర్), వసంత (కమ్మర్‌పల్లి)కు సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నిజామాబాద్ వారి సౌజన్యంతో బహుమతులు అందజేశారు.

## వరుస చోరీలతో హడలెత్తిస్తున్న దొంగలు

రుద్రూర్, ఆగస్టు 9 : వరుస చోరీలతో చిల్లర దొంగలు హడలెత్తిస్తున్నారు. సులేమాన్‌నగర్ గైనిగుట్టల బసవేశ్వర ఆలయం వద్ద శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి రెండు మూడుగంటలపాటు ఆలయ పరిధిలో తిరిగి విద్యుత్‌తీగ చుట్టను చోరీ చేసేందుకు యత్నించాడు. స్థానికులు అరవడంతో అక్కడి నుంచి పారిపోయాడు. రుద్రూర్ మండలకేంద్రంలో ఇటీవల ప్రారంభించిన శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో గురువారం రాత్రి వివిధ వస్తువులను చోరీ చేశారు. రెండు రోజుల క్రితం రుద్రూర్ మండల కేంద్రంలోని వీరభద్రాలయంలో హుండీ పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లారు. పోలీసులు నిఘాపెట్టి ఆలయాలను టార్గెట్ చేస్తున్న దుండగులను పట్టుకోవాలని భక్తులు కోరుతున్నారు.

## 16 నుంచి పీడీఎస్‌యూ శిక్షణ తరగతులు

డిచ్‌పల్లి, ఆగస్టు 9 : పీడీఎస్‌యూ రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను ఈ నెల 16 నుంచి 18 వరకు సిద్దిపేటలో నిర్వహించనున్నామని, జయప్రదం చేయాలని జిల్లా ప్రధానకార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ కోరారు. టీయూలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి జయంతి, నాయకులు ప్రిన్స్, అక్షయ్, బిందు, రాకేశ్, లహరి, అఖిల్, బాలాజీ, మధు, రాజేందర్, మహేందర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

కలిగోట్ శివాలయంలో పూజలు చేస్తున్న మహిళలు, పూజల్లో పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

జిల్లాకేంద్రంలోని జీజీ కళాశాల సమీపంలో పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఆగస్టు 9 : జిల్లావ్యాప్తంగా నాగుల పంచమి పండుగను ప్రజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మహిళలు శివాలయాలను దర్శించుకున్నారు. పుట్టల వద్దకు వెళ్లి పాలు పోసి, పూజలు చేశారు. అనంతరం అక్కాచెల్లెళ్లు అన్నాదమ్ములకు ఆవుపాలతో కండ్లు కడిగి ఆశీర్వాదం తీసుకున్నారు. జిల్లాకేంద్రంలోని పలు ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఇందూరు గో సేవా సమితి, గోకుల్ సేవా సమితి తదితర స్వచ్ఛంద సంస్థల ఆధ్వరయలో ఉచితంగా ఆవుపాలను పంపిణీ చేశారు. జిల్లాకేంద్రంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న భూలక్ష్మీమాత ఆలయంలో నాగదేవత విగ్రహాల పునః ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆలయ అధ్యక్షుడు ఆకుల శ్రీశైలం ఆధ్వర్యంలో నిర్వహించారు. నగరంలోని వివేకానందకాలనీలో రేణుకాఎల్లమ్మ ఆలయంలోని పుట్టలో నాగదేవతకు నగర మేయర్ దండు నీతూ కిరణ్ పాలు పోసి పూజలు నిర్వహించారు. ధర్పల్లిలో తాజా మాజీ ఎంపీపీ నల్ల సారికా హన్మంత్‌రెడ్డి పూజలు చేశారు. తిర్మన్‌పల్లి ఎల్లమ్మ ఆలయానికి భక్తులు తరలివచ్చారు. రుద్రూర్, చందూర్, మోస్రా మండల కేంద్రాల్లో బజరంగ్‌దళ్, హిందూవాహిని, దుర్గావాహిని ఆధ్వర్యంలో, పోతంగల్‌లో స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో, హంగర్గాలో బాలల గణేశ్ మండలి ఆధ్వర్యంలో ఆవుపాలను పంపిణీ చేశారు. బోధన్‌లోని ఏకచక్రనగర్ సంతాన నాగమ్మ ఆలయం, శివాలయం వద్ద నాగమ్మ మందిరం తదితర ఆలయాల్లో మహిళలు పూజలు నిర్వహించారు. ఆలయంలో ఆలయ వ్యవస్థాపకుడు గుమ్ముల అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మోర్తాడ్, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల, బోధన్, మాక్లూర్, ఎడపల్లి, నవీపేట, రెంజల్ తదితర మండలాల్లో మహిళలు పుట్టలో పాలు పోసి పూజలు నిర్వహించారు. బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో రామ్‌సేన యూత్ ఆధ్వర్యంలో ఆవు పాలను ఇందూరు గోసేవా సమితి సహకారంతో పంపిణీ చేశారు. నందిపేట్ పలుగుట్ట కేదారేశ్వర ఆశ్రమంలో మహిళలు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. జక్రాన్‌పల్లి మండలంలోని కలిగోట్ గ్రామంలోని శివాలయాన్ని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి దర్శించుకుని పూజలు చేశారు.

బోధన్ ఏకచక్రనగర్‌లోని సంతాన నాగమ్మ ఆలయంలో ..

కమ్మర్‌పల్లిలో పాముపుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు

నందిపేట్ కేదారేశ్వర ఆశ్రమం పలుగుట్టలో..

## చెరువులో పడి వృద్ధురాలి మృతి

పొతంగల్, ఆగస్టు 9 : ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధురాలు మృతిచెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ విలేజ్‌కు చెందిన గోవూరు గంగవ్వ (68)కు కొంతకాలంగా మతిస్థిమితం లేదు. మూడు రోజుల క్రితం కాలకృత్యాలకు వెళ్లిన ఆమె.. కాలుజారి స్థానిక చెరువులో పడి మృతిచెందింది. చెరువులో శుక్రవారం మృతదేహం తేలింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అనారోగ్యంతో బాధపడుతూ వివాహిత ఆత్మహత్య

వినాయక్‌నగర్, ఆగస్టు 9 : జిల్లాకేంద్రంలోని గంజ్ ఏరియాకు చెందిన రాణీదేవి (30)కి కొంతకాలంగా మతిస్థిమితం లేకపోవడంతో అనారోగ్యంతో బాధపడుతూ గురువారం ఆత్మహత్య చేసుకున్నట్లు త్రీ టౌన్ ఎస్సై ప్రవీణ్ తెలిపారు. బీహార్ రాష్ట్రానికి చెందిన రాణీదేవి కుటుంబం 15 ఏండ్లుగా బతుకుదెరువు కోసం నిజామాబాద్‌లో ఉంటున్నారు. మృతురాలి భర్త శ్రీచందన్‌తోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## మల్టీజోన్ పరిధిలో ఎస్సైల బదిలీలు

- **ఐదు జిల్లాల్లో 40 మందికి స్థానచలనం**

వినాయక్‌నగర్, ఆగస్టు 9 : మల్టీజోన్–1 పరిధిలోని పలు జిల్లాలో భారీగా సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఇన్‌స్పెక్టర్ జనరల్ శుక్రవారం ఆర్డర్స్ వెలువరించారు. ట్రాన్స్‌ఫర్స్ అయిన వారిలో నిజామాబాద్, సిరిసిల్ల, జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న ఎస్సైలు ఉన్నారు. బదిలీ అయిన వారిలో ఎస్‌హెచ్‌వోలతో పాటు వీఆర్‌లో ఉన్నవారు, స్టేషన్లలో అటాచ్డ్‌గా ఉన్న సిబ్బంది ఉన్నారు. ఐదు జిల్లాల్లో మొత్తం 40 మంది ఎస్సైలకు స్థాన చలనం కల్పిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## గంజాయి సరఫరా చేస్తున్న ఒకరి అరెస్టు

వినాయక్‌నగర్, ఆగస్టు 9 : గంజాయి సరఫరా చేస్తున్న ఒకరిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నిజామాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి ఆదేశాల మేరకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో దిలీప్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. నగరంలోని ఖిల్లా చౌరస్తాలో షేక్ అబ్దుల్ సమద్ మోపెడ్‌పై గంజాయి సరఫరా చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. 455 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని, నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దాడులు నిర్వహించిన వారిలో ఎస్సై మల్లేశ్, షబీరుద్దీన్, ప్రభాకర్, సంజయ్, ధర్‌సింగ్ తదితరులు ఉన్నారు.

## మున్సిపల్‌లో అక్రమాలపై విచారణ చేపట్టాలి

ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు9: మున్సిపల్ పరిధిలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని కోరుతూ ఆర్డీవో రాజాగౌడ్‌కు బీజేపీ నాయకులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ స్థలాలు, ఇరిగేషన్ భూములు, అసైన్డ్ భూములను కొందరు కబ్జాచేసి ఇండ్లు నిర్మించుకున్నారని అన్నారు. తమ పార్టీ ఆధ్వర్యంలో పలుమార్లు వినతిపత్రం అందజేసినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. మున్సిపల్‌లో సుమారు రూ.వందకోట్లకుపైగా భూ కుంభకోణం జరిగిందన్నారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలల్లోనే పెద్దమొత్తంలో అవినీతి జరగడం విచారకరమన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి

- **అధికారులు, ప్రజాప్రతినిధుల పిలుపు**
- **ముగిసిన 'స్వచ్ఛదనం - పచ్చదనం'**

చంద్రశేఖర్ కాలనీలోని కమ్యూనిటీ భవన ఆవరణలో మొక్క నాటుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

వర్నిరోడ్డులోని అటవీ శాఖ కార్యాలయంలో మొక్కలు నాటిన అనంతరం అధికారులు, సిబ్బందితో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నమస్తేతెలంగాణ యంత్రాంగం, ఆగస్టు 9 : ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని, మొక్కలు నాటాలని అధికారులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించిన స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని మొక్కలు నాటారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించి, పలు సూచనలు చేశారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మేయర్ దండు నీతూకిరణ్‌తో కలిసి శుక్రవారం చంద్రశేఖర్‌కాలనీలో ఆయన పర్యటించారు. కమ్యూనిటీ భవన ఆవరణలో మొక్కలు నాటడంతోపాటు మహిళలకు మొక్కలు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ మకరంద్, డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ ఉన్నారు. జిల్లాకేంద్రంలోని వర్ని రోడ్డులో ఉన్న అటవీ శాఖ కార్యాలయంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఐఎఫ్ఎస్ వికాస్ మీనా, డీఎఫ్‌వో సుధాకర్, ఎఫ్ఆర్‌వోలు సంజయ్, రాధికతోపాటు విద్యార్థులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ధర్పల్లి మండల పరిషత్ కార్యాలయ వెనుక భాగంలో మండల ప్రత్యేకాధికారి, డీఎల్పీవో శ్రీనివాస్ నాయకులతో కలిసి మొక్కలు నాటారు. సిరికొండ మండలంలోని గడ్కోల్‌లో అటవీ శాఖ రేంజ్ అధికారి వినాయక్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. డిచ్‌పల్లి మండలం రాంపూర్(డీ) వృద్ధాశ్రమంలో ప్రభుత్వ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి సాయాగౌడ్, జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారిణి రసూల్ బీ, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ బూస ఆంజనేయులు, పవర్ గ్రిడ్ అధికారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. జక్రాన్‌పల్లి కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు మండల ప్రత్యేకాధికారి తిరుమలప్రసాద్.. తహసీల్దార్ కిరణ్మయితో కలిసి అవగాహన కల్పించారు. మోస్రా పీహెచ్‌సీలో వైద్యులు సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. బోధన్ పట్టణం, మండలం, మాక్లూర్, మోర్తాడ్ మండలాల్లో స్వచ్ఛదనం– పచ్చదనం' కార్యక్రమాలు కొనసాగాయి. బోధన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని అడిషనల్ కలెక్టర్ అంకిత్ తనిఖీ చేశారు. 25వ వార్డులో నిర్వహిస్తున్న కార్యక్రమాలను పరిశీలించారు. రాకాసీపేట్‌లోని వాటర్‌వర్క్స్‌ను సందర్శించారు. శక్కర్‌నగర్‌లోని బస్తీ దవాఖాన, ఆచన్‌పల్లిలోని యాదాద్రి ప్లాంటేషన్, డంపింగ్‌యార్డును పరిశీలించారు. బోధన్ మండలంలోని ఎరాజ్‌పల్లి గ్రామంలో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. బోధన్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయస్థానం ఆవరణలో మొక్కలు నాటారు. బోధన్ న్యాయస్థానం ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి రవికుమార్ మొక్కలు నాటారు. సీనియర్ సివిల్ జడ్జి దేవన్ అజయ్ కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పూజిత, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సాయి శివ తదితరులు పాల్గొన్నారు. మాక్లూర్ మండలంలోని ముల్లంగి(బి) గ్రామంలో ర్యాలీలో మాజీ జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పాల్గొన్నారు. కమ్మర్‌పల్లి మండలం ఇనాయత్‌నగర్ గ్రామంలో డ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఎంపీడీవో రాజశ్రీనివాస్ పరిశీలించారు. తిమ్మాపూర్ గ్రామంలో కార్యక్రమాలను డీఎల్‌పీవో శివచరణ్ పరిశీలించారు.

బోధన్ న్యాయస్థానం ఆవరణలో న్యాయవాదులతో కలిసి మొక్కలు నాటుతున్న న్యాయమూర్తులు

జక్రాన్‌పల్లి కస్తూర్బా పాఠశాలలో మొక్కలు నాటుతున్న ప్రత్యేకాధికారి తిరుమల ప్రసాద్

ముల్లంగి(బి)లో ర్యాలీలో పాల్గొన్న జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, అధికారులు

బోధన్‌లోని డంపింగ్‌యార్డులో చెత్తలో ప్లాస్టిక్, గాజు వ్యర్థాలను వేరు చేసే యంత్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ అంకిత్

## హత్యాయత్నం కేసులో మహిళ రిమాండ్

నవీపేట, ఆగస్టు 9: గ్రైండర్ విక్రయం విషయంలో ఏర్పడిన వివాదంలో ఓ మహిళపై కత్తితో హత్యాయత్నం చేసిన మరో మహిళను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. జలాల్‌పూర్ గ్రామానికి చెందిన గనిశెట్టి గంగవ్వ అదే గ్రామానికి చెందిన ఈర్నాల సావిత్రికి నెలన్నర క్రితం రూ.రెండు వేలకు గ్రైండర్‌ను విక్రయించింది. గ్రైండర్ పనిచేయక పోవడంతో తాను ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని సావిత్రి కోరింది. డబ్బులు ఇవ్వకపోవడంతో గంగవ్వపై సావిత్రి కక్ష పెంచుకుంది. జూలై 26న గంగవ్వ ఇంటికి సావిత్రి వెళ్లి కమ్మకత్తితో తలపై దాడి చేసింది. గంగవ్వకు వరుసకు సోదరుడైన గనిశెట్టి రాజు ఫిర్యాదు మేరకు ఈర్నాల సావిత్రిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## కాలువ శుభ్రం చేస్తుండగా కొండ చిలువ మృతి

నవీపేట, ఆగస్టు 9: మండల కేంద్రంలో అలీసాగర్ లిఫ్టు కాలువను జేసీబీతో శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు కొండ చిలువ శుక్రవారం మృత్యువాత పడింది. స్థానికుల కథనం ప్రకారం.. మూడు రోజుల క్రితం నవీపేట పాలిటెక్నిక్ కళాశాలను ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తనిఖీ చేశారు. పాలిటెక్నిక్, మోడల్ స్కూల్ విద్యార్థుల సౌకర్యార్థం లిఫ్టు కాలువపై మినీ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు కోరారు. వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని ఇరిగేషన్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. వంతెన నిర్మించాల్సిన స్థలంలో పిచ్చిమొక్కలు తొలగించేందుకు అధికారులు కాలువను జేసీబీతో శుభ్రం చేయిస్తున్నారు. అక్కడే ఉన్న 12 అడుగుల పొడవైన కొండ చిలువ జేసీబీ బకెట్‌కు తగిలి మృతి చెందింది.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★ "వరలక్ష్మీ వ్రతం" ఆఫర్... 1 ప్లాట్ బుకింగ్‌పై 2 గ్రాముల గోల్డ్ కాయిన్ ఫ్రీ... ఫ్రీ... 1 లక్షకే 121 గజాల ప్లాట్... ఎర్రచందనం మొక్కలతో నారాయణఖేడ్. Cont: 8500664291.

NT-332613

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## ఇరు వర్గాల మధ్య గొడవ.. కేసు నమోదు

శక్కర్‌నగర్, ఆగస్టు 9: బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ చౌరస్తాలోని ఓ హోటల్‌లో దాడులకు పాల్పడిన ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వీరయ్య శుక్రవారం తెలిపారు. రాకాసీపేట్‌కు చెందిన అన్సార్ అలీ అనే వ్యక్తిని ఉదయం మున్సిపాలిటీ వద్ద కౌన్సిలర్లు మీర్ నజీర్ అలీ, అతనితో పాటు మరో కౌన్సిలర్ దూషించారు. తనకు సంబంధం లేని విషయంలో ఎందుకు దూషిస్తున్నారంటూ వారి మధ్య గొడవ మొదలైంది. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో తనను దూషించి దాడికి యత్నించారని అన్సార్ అలీ తన సోదరులతో పాటు ఇతరులకు చెప్పారు. దీంతో వారు వచ్చి శక్కర్‌నగర్‌లోని హోటల్‌లో ఉన్న కౌన్సిలర్లపై దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటనలో ఇరు వర్గాల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు కౌన్సిలర్లు మీర్ నజీర్ అలీ, ఇమ్రాన్‌పై, రాకాసీపేట్‌కు చెందిన అన్సార్ అలీతోపాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

**హోటల్ మూసివేత**

గొడవ సమాచారం అందిన పోలీసులు హోటల్ వద్దకు వచ్చి ఇరు వర్గాలను అక్కడి నుంచి పంపారు. అనంతరం హోటల్‌ను మూసివేయించారు. ఈ సంఘటనపై పోలీసులు విచారణ చేపడుతున్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

ఆర్మూర్ మండలం చేపూర్‌లో శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కుమ్రంభీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చేపూర్ ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘాల అధ్యక్షుడు మేడిపల్లి గిరీశ్ తదితరులు పాల్గొన్నారు. సిరికొండ మండలంలోని చీమన్‌పల్లిలో ఆదివాసీ నాయక్‌పోడ్ కుల సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ కుమ్రం భీం చిత్రపటానికి పూలమాలలు వేశారు.

– ఆర్మూర్‌టౌన్/సిరికొండ, ఆగస్ట్9

## కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

శక్కర్‌నగర్, ఆగస్టు 9: బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్మిక సంఘాల నాయకులు శంకర్‌గౌడ్, పుట్ట వరదయ్య మాట్లాడుతూ దేశం కార్పొరేట్ సంస్థలు, రాజకీయ నాయకుల దోపిడీకి గురవుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను పెట్టుబడి దారులకు దోచిపెడుతోందని అన్నారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో పోరాడాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగాధరప్ప, గంగామణి, పత్రి ఎల్లయ్య, దాసి గోపి, పేట పోశెట్టి, డి. పోశెట్టి, పట్నం రాములు, బి. సాయిలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఐఎఫ్‌టీయూ సంఘాల నాయకులు

## ఘనంగా తీజ్

తీజ్ వేడుకల్లో పాల్గొన్న టీయూ ప్రొఫెసర్లు, విద్యార్థులు

డిచ్‌పల్లి, ఆగస్టు 9 : టీయూలో గిరిజన నాయకుడు శ్రీనూనాయక్ ఆధ్వర్యంలో తీజ్ పండుగను శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆరతి హాజరై మాట్లాడారు. సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలన్నారు. గిరిజన సంప్రదాయం ప్రకారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ శాంతాదేవి, ప్రొఫెసర్ కిరణ్‌రాథోడ్, విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల నిరసన

నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

వినాయక్‌నగర్, ఆగస్టు 9 : జనగామ జిల్లా కేంద్రంలో న్యాయవాద దంపతులపై భౌతిక దాడులకు పాల్పడిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు నిరసన తెలిపారు. జిల్లాకేంద్రంలోని కోర్టు చౌరస్తా వద్ద మూడో రోజు శుక్రవారం మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు రాజేందర్‌రెడ్డి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

- **జాతీయ జెండా ఆవిష్కరణ** - కంఠేశ్వర్, ఆగస్టు 9 : క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో జాతీయ జెండాను రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నగర అధ్యక్షుడు కేశవేణు ఎగురవేశారు. జాతీయ యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కాంగ్రెస్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు విక్కీ యాదవ్ యువజన కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు.
- **అపార్ట్‌మెంట్‌లో సమస్యలు పరిష్కరించాలని ఫిర్యాదు** - కంఠేశ్వర్, ఆగస్టు 9 : అపార్ట్‌మెంట్ సమస్యలు తీర్చాలని ముబారక్‌నగర్ సాయి అట్కారీ అపార్ట్‌మెంట్ వాసులు జిల్లాకేంద్రంలో ఉన్నతాధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. విఘ్నేశ్వర కన్‌స్ట్రక్షన్ ద్వారా తాము 75 ఫ్లాట్లు ముబారక్‌నగర్‌లో కొనుగోలు చేశామని, డబ్బులు పూర్తిగా చెల్లించినా పనులు పూర్తిచేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు పేర్కొన్నారు. రెండురోజులక్రితం అపార్ట్‌మెంట్‌లో లిఫ్ట్ కిందికి జారిపడడంతో 5 చిన్నారులు అదృష్టవశాత్తు బయటపడ్డారని తెలిపారు. సమస్యను పరిష్కరించాలని కోరారు.
- **చేవెళ్ల డిక్లరేషన్